# తీవ్ర ఊగిసలాట?




**గత వారం:** ప్రపంచ మార్కెట్లు బలహీనంగా ఉన్నప్పటికీ కిందటి వారంలో విదేశీ సంస్థాగత మదుపరుల (ఎఫ్ఐఐ) నిధులు మార్కెట్‌లోకి తరలి రావడంతో సెన్సెక్స్ 235 పాయింట్లు ఎగసింది. జులై నెల టోకు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం (డబ్ల్యూపీఐ) ఊహించిన దాని కన్నా తక్కువగా మాత్రమే పెరిగి 9.97 శాతం వద్ద స్థిర పడ్డా (జూన్‌లో డబ్ల్యూపీఐ 10.55% కావడం గమనార్హం), ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన సంకేతాలు బలహీనంగా ఉన్నందువల్ల మార్కెట్ సోమవారం 17997 స్థాయికి జారింది. మంగళవారమూ మార్కెట్ తేజోవిహీనంగానే ఉంది. బుధవారం వెలువడ్డ అమెరికా పారిశ్రామికోత్పత్తి గణాంకాలు మెరుగ్గా ఉండటం మదుపరులలో విశ్వాసాన్ని పెంపొందించి ర్యాలీకి ఊతంగా నిలిచింది. ఆనక ప్రపంచ మార్కెట్లు పుంజుకోవడం, ఎఫ్ఐఐ నిధుల ప్రవాహం ప్రామాణిక సూచీలు ఎగబాకడానికి దారితీశాయి. గురువారం సెన్సెక్స్ 18475 స్థాయిని అందుకొంది. ఇది 30 నెలల గరిష్ఠం కావడం విశేషం. శుక్రవారం అమెరికాలో నిరుద్యోగుల సంఖ్య పెచ్చుపెరిగిందన్న సమాచారం పొక్కి ప్రపంచ మార్కెట్లు క్షీణ పథంలో సాగాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 18402కు కుంగింది.

**ఎఫ్ఐఐల తీరు:** భారత ఈక్విటీలపై ఎఫ్ఐఐలు సానుకూల వైఖరి కనబరిచాయి. నికరంగా రూ.4,447 కోట్ల నిధులను అవి తీసుకువచ్చాయి. మ్యూచువల్ ఫండ్‌లు మాత్రం మునుపటి ధోరణిలోనే నికర విక్రయదారులుగా నిలిచాయి. రూ.563 కోట్ల విలువైన ఈక్విటీలను అమ్మివేశాయి.

**రంగాల వారీగా:** మదుపరులు జాగ్రత్తగా మెలగడంతో త్వరితగతిన అమ్ముడయ్యే వినియోగ వస్తువుల రంగం, ఆరోగ్య సంరక్షణ రంగాలు ప్రయోజనం పొందాయి. బ్యాంకింగ్ షేర్ల కౌంటర్లలో రద్దీ కనిపించింది. విద్యుత్తు, మన్నికైన వినియోగ వస్తువుల రంగాలు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ప్రపంచ దేశాలు ఆర్థిక మాంద్యం నుంచి కోలుకొనే ప్రక్రియ వేగం కోల్పోవచ్చన్న కలవరం మధ్య ఐటీ షేర్లు వెనుకపట్టు పట్టాయి.

**లాభ నష్టాల నిష్పత్తి:** శుక్రవారం లాభపడిన, నష్టపోయిన షేర్ల నిష్పత్తి 1:1గా ఉండి, మధ్య విలువ, చిన్న విలువ షేర్లలో కొన్ని షేర్లలో మాత్రమే చలనాలు కొనసాగడాన్ని సూచించింది.

**ఈ వారం:** వరుసగా మూడో సారి క్రితం వారం కూడా మార్కెట్ లాభాలతో ముగిసింది. మార్కెట్ 18050 స్థాయికి ఎగువన ఉన్నంత వరకు స్వల్ప కాలంలో ఊర్ధ్వ ముఖ పయనం కొనసాగే అవకాశం ఉంది. ఎఫ్ఐఐల నిధుల రాకడ కొనసాగి దేశీయ సూచీలను పైపైకి నెట్టవచ్చని భావిస్తున్నారు.

**మార్కెట్‌ను ప్రభావితం చేసే అంశాలు:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈ వారం ముగియనుండటంతో ప్రత్యక్ష పన్ను స్మృతి (డీటీసీ) బిల్లును ప్రవేశపెట్టేదీ లేనిదీ మార్కెట్ వేచి చూస్తుంది. ముఖ్యంగా దీర్ఘ కాల మూలధన లాభాలపై పన్ను గురించి ఏమైనా వివరణ లభిస్తుందేమో పరిశీలించనుంది. అలాగే రుతుపవనాల కదలికల తీరును సమీక్షించుకొంటుంది. గురువారంతో డెరివేటివ్స్ గడువు తీరనుండడం కూడా మార్కెట్‌ను ప్రభావితం చేయవచ్చు. అంతర్జాతీయ స్థాయి పరిణామాలలో.. అమెరికాలో ఇళ్ల అమ్మకాల గణాంకాలు, అమెరికాలో మన్నికైన వస్తువుల కొనుగోలు ఆర్డర్లు, నిరుద్యోగుల సంఖ్య సంబంధిత సమాచారం ఈ వారం వెల్లడి కానున్నాయి. ఇవి కూడా మార్కెట్ తీరును శాసించవచ్చు.

**తక్షణ నిరోధ స్థాయిలు:** 18542, 18724, 18832; **తక్షణ మద్దతు స్థాయిలు:** 18276, 18068, 17997

**స్వల్ప కాలంలో మార్కెట్ తీవ్ర అస్థిరతకు లోనవ్వొచ్చని అంచనాలు ఉన్నాయి.**

– *సతీశ్ కంతేటి, జెన్ సెక్యూరిటీస్*